
సాక్షి
కాకినాడ

మంగళవారం | 6 | జూన్ | 2023



డెల్టాలకు 4150 క్యూసెక్కులు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 4,150 క్యూసెక్కుల నీరు వదిలారు. తూర్పు 1,100, సెంట్రల్ 50, పశ్చిమ డెల్టాకు 3 వేల క్యూసెక్కులు వదిలారు.



భారీగా చదివింపులు

రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
42.0° / 25.5°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	25.5
కాకినాడ	39.0	26.8
అమలాపురం	39.5	27.4

న్యూస్‌రీల్

లక్ష్మణరావు కుటుంబానికి మంత్రి రాజా ఆర్థిక సాయం



లక్ష్మణరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో ఆదివారం జరిగిన టిప్పర్ ప్రమాదంలో మృతి చెందిన తూము లక్ష్మణరావు కుటుంబానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి అండగా నిలిచారు. ఎ.కొత్తపల్లిలోని లక్ష్మణరావు నివాసానికి సోమవారం స్వయంగా వెళ్లిన ఆయన వ్యక్తిగతంగా రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, తుని ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు తదితరులున్నారు.

జిల్లా టీబీ అధికారికి కాంస్య పతకం



డాక్టర్ రమేష్‌కు కాంస్య పతకం అందిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా


కాకినాడ సిటీ: టీబీ కేసుల నియంత్రణలో విశేష కృషి చేయడంతో పాటు, జిల్లాలో గత ఏడాదితో పోల్చితే 20 శాతం కేసులు తగ్గుముఖం పట్టడంతో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఆర్.రమేష్‌కు రాష్ట్ర ప్రభుత్వం కాంస్య పతకం అందజేసింది. ఈ పతకాన్ని ఆయనకు కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం ప్రదానం చేశారు. సెంట్రల్ టీబీ డివిజన్ ఆదేశాల మేరకు 2022లో 10 గ్రామాల్లో సబ్ నేషనల్ సర్టిఫికేషన్ సర్వే నిర్వహించారు. 10,001 మందిని స్క్రీనింగ్ చేసి, 168 మందిని పరీక్షించగా మూడు టీబీ కేసులు నిర్ధారణ అయ్యాయి. 2015 నుంచి 2022 వరకూ చూస్తే టీబీ కేసులు 20 శాతం తగ్గాయి. జిల్లాలో లక్ష మందికి 209 కేసులు నమోదవుతున్నాయని కలెక్టర్ కృతికా శుక్లా వెల్లడించారు. టీబీ రోగుల కుటుంబ సభ్యులకు ప్రివెంటివ్ థెరపీ ద్వారా ఉచితంగా 6 నెలలు మందులు ఇస్తున్నారన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో టీబీ లక్షణాలున్న వారిని కనుగొని సంబంధిత వైద్య పరీక్షలు చేయిస్తున్నామని తెలిపారు. ప్రతి టీబీ బాధితునికి పీఎంటీబీఎంబీఏ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా రూ.700 విలువైన పౌష్టికాహార కిట్లు ఆరు నెలల పాటు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఈ చర్యలు విస్తృతంగా చేపట్టడం ద్వారా జిల్లాలో టీబీ వ్యాధి వ్యాప్తి 20 శాతం తగ్గించామని వెల్లడించారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యాన వైఎస్సార్ కడపలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) సీఈఓ షేక్ ఇమ్రాన్ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈ నెల 15 నుంచి 20 వరకూ మండలాల్లో ఎంపీడీఓల పర్యవేక్షణలో, 23న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిల్లా స్థాయిలో ఎంపికలు జరుగుతాయని వివరించారు. 4వ తరగతికి 2014 ఆగస్టు 1 నుంచి 2015 జూలై 31 మధ్య పుట్టిన వారు అర్హులని డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. అలాగే 5వ తరగతికి 2013 ఆగస్టు 1 నుంచి 2014 జూలై 31 మధ్యలో జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు పాఠశాల స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో ఎంపికలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 89196 42248 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

పిఠాపురం: పట్టణంలోని రాపర్తి జంక్షన్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 34.12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు విజిలెన్స్ సీఐ సత్యకిషోర్, ఏఓ భార్గవ మహేష్, ఎంఎస్ఓ సరోజిని తదితరులు కడింశెట్టి అంజనికి చెందిన ఇంటిపై దాడి చేశారు. అక్కడ వెలుగుల చినబాబ్జీకి చెందిన రూ.1.38 లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టుబడింది. బియ్యం నిల్వ చేయడానికి ఇల్లు ఇచ్చిన యజమానితో పాటు, బియ్యం నిల్వ చేసిన వ్యక్తిపై పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు.



పెట్టుబడి కాలం

నిబంధనల ప్రకారమే ఫీజుల వసూలు



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు వసూలు చేయాలి. ఆయా తరగతుల వారీగా వసూలు చేసే ఫీజులను ప్రతి ప్రైవేటు పాఠశాలల్లోని నోటీసు బోర్డుపై ప్రదర్శించాలి. ప్రజల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఫీజులు వసూలు చేయాలి. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తే ఇటు ఇంగ్లిషు మీడియంలో చదువు ఉంటుంది. అటు ఫీజులు, డ్రెస్సులు, బ్యాగు, షూస్, సాక్సులు, పుస్తకాల సమస్య ఉండదు. ప్రభుత్వం అన్నీ ఉచితంగా ఇస్తుంది.
– కేఎస్‌వీఎస్ అన్నపూర్ణ, జిల్లా విద్యాశాఖాధికారి

- బరువెక్కుతున్న 'ప్రైవేటు' చదువులు
- విద్యా సంవత్సరం ప్రారంభంతో తల్లిదండ్రులపై తప్పని భారం
- జిల్లాలో 435 ప్రైవేటు పాఠశాలలు



కాకినాడ సిటీ: ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రస్తుతం 'పెట్టు'బడి కాలం' నడుస్తోంది. తమ పిల్లల ఫీజులు, ఇతర ఖర్చుల రూపంలో వారికి భారం తప్పడం లేదు. కరోనా కారణంగా రెండేళ్ల క్రితం ఆన్‌లైన్ క్లాసుల పేరుతో కార్పొరేట్ పాఠశాలలు ఫీజులు వసూలు చేశాయి. అప్పట్లో ఫీజులు పూర్తిగా వసూలు కాలేదు. దీంతో గత రెండేళ్ల ఆర్థిక నష్టాన్ని పూడ్చుకునే పనిలో ఉన్న పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈసారి అమాంతం ఫీజులు పెంచేశాయి. దీనికి తోడు డొనేషన్లు, యూనిఫాం, పుస్తకాలు, బ్యాగులు, షూ, ఇతర వస్తువుల కొనుగోళ్లు విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి.

ప్రైవేటు బాదుడు ఇలా..

పాఠశాలలు తెరచుకుంటే చాలు.. ప్రైవేటు యాజమాన్యాల పంట పండినట్టే. స్కూళ్లలో కనీస సదుపాయాలు లేకున్నా ప్రచార హోరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దింది.. దిద్దుతోంది. జగనన్న విద్యా కానుక కింద పుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, యూనిఫాం, సాక్సులు, బూట్లు, బ్యాగ్‌లు ఉచితంగా అందజేస్తోంది. ఆంగ్ల మాధ్యమంలో బోధన అందిస్తోంది. అయినప్పటికీ పెద్ద స్కూల్‌లో చదివితే గౌరవంగా భావించే కొంత మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో చేర్పిస్తున్నారు. కాకినాడ జిల్లా వ్యాప్తంగా 435 ప్రైవేటు స్కూళ్లు ఉన్నాయి. వీటిలో దాదాపు 64,456 మంది చదువుతున్నారు. మౌలిక సదుపాయాలు, అనుభవజ్ఞులైన, క్వాలిఫైడ్ టీచర్లు, బోధన నాణ్యత ఆధారంగా తమకు తామే ఎ, బి, సి కేటగిరీలుగా వర్గీకరించుకున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు భారీగానే వసూలు చేస్తున్నాయి. నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.20 వేలు, 8 నుంచి పదో తరగతి వరకూ రూ.18,600 నుంచి రూ.28,400 వరకూ తీసుకుంటున్నాయి. రెసిడెన్షియల్ స్కూల్ అయితే రూ.లక్షల్లోనే వసూలు చేస్తున్నారు. వీటితో పాటు పలు స్కూళ్లలో పాఠశాల అభివృద్ధి కోసం (స్పెషల్ ఫీజు), ట్యూషన్, ఎగ్జామినేషన్, లైబ్రరీ.. ఇలా రకరకాల ఫీజులతో తల్లిదండ్రులను బాదేస్తున్నారు.

- స్కూల్లో చేరిన ప్రతి విద్యార్థికీ యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలు, బూట్లు తప్పనిసరి. చాలా వరకూ ఆయా ప్రైవేటు స్కూళ్లలోనే ఇవి లభ్యమవుతున్నాయి. కొన్ని పాఠశాలలు మాత్రం బయట కొనుగోలు చేసుకోవాలని సూచిస్తున్నాయి.

కేటగిరీల వారీగా ఫీజులు (రూ.లలో)

తరగతి	గ్రేడ్–ఎ	గ్రేడ్–బి	గ్రేడ్–సి
నర్సరీ–6	24,000	18,000	14,500
7–10	32,000	28,000	22,000

ప్రస్తుతం ఒక్కో జత యూనిఫాం ధర రూ.800 నుంచి రూ.1,200 వరకూ ఉంది. కనీసం రెండు జతల యూనిఫాం అవసరం. ఈ లెక్కన ఒక్కో విద్యార్థి యూనిఫాంకు తల్లిదండ్రులపై రూ.1,600 నుంచి రూ.2,400 వరకూ భారం పడుతోంది.

- ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ బయట ముద్రించిన పుస్తకాలు బోధించే వెసులుబాటు ఉండగా.. ఆరు నుంచి పదో తరగతి వరకూ ప్రభుత్వం ముద్రించిన పుస్తకాలే కచ్చితంగా వాడాలనే నిబంధన ఉంది. దీంతో ఆరో తరగతి వరకూ ఏ స్కూలుకు సంబంధించిన పుస్తకాలు ఆ స్కూల్‌లోనే విక్రయిస్తున్నారు. ఎవరికి వారే సిలబస్ ప్రిపేర్ చేసుకుని, వారే ముద్రించి విద్యార్థులకు అందజేస్తున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ కోసం రూ.4 వేల నుంచి రూ.10 వేల పైనే వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పుస్తకాలను బయట కొనుగోలు చేసే పలు యాజమాన్యాలు తమ స్కూళ్లలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు సమాచారం.
- స్కూల్ బ్యాగుల ధరలూ చుక్కలనంటుతున్నాయి. మార్కెట్లో ఒక్కో బ్యాగు ధర రూ.400 నుంచి రూ.900 వరకూ ఉంది.
- ఇక ప్రతి విద్యార్థికీ కనీసం రెండు జతల షూ అవసరం. ఒక్కో జత రూ.200 నుంచి రూ.600 ఉంది.
- ఆటో చార్జీలు, స్కూల్ బస్సు ఖర్చులు ఒక్కో పాఠశాలకు ఒక్కోలా ఉన్నాయి.

స్పందనకు 330 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనకు 330 అర్జీలు వచ్చాయి. స్పందన కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్ఓ కె.శ్రీధర్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ ఎన్‌వీవీ సత్యనారాయణ, బీసీ, ఎస్సీ కార్పొరేషన్ల ఈడీలు ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, డీఎస్ సునీత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించి, నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పరిష్కార నివేదికను, లబ్ధిదారుల సమస్యకు సంబంధించిన ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు.

పోలీస్ స్పందనకు 68 ఫిర్యాదులు

కాకినాడ క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 68 ఫిర్యాదులు వచ్చాయని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. మహిళల నుంచి 29, పురుషుల నుంచి 39 ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు.

డీఎల్‌పీఓగా అన్నామణి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ)గా అన్నామణి నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేస్తున్న వై.అమ్మాజీ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ఏలూరు డీఎల్‌పీఓ అన్నామణి నియమితులయ్యారు. త్వరలో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు. బదిలీ అయిన అమ్మాజీ రిలీవ్ కావడంతో పెద్దాపురం డీఎల్‌పీఓ బాలమణిని ఇన్‌చార్జి డీఎల్‌పీఓగా నియమించారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పిఠాపురం: సృష్టిలో ప్రకృతికి, మనిషికి చాలా దగ్గర సంబంధాలున్నాయని, మనిషికి ప్రాణవాయువును అందించే మొక్కలు, చెట్లను సంరక్షించుకోవడం అందరి బాధ్యతని విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పీఠంలో సోమవారం ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యాన విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం 'నా మొక్క – నా శ్వాస' నినాదంతో పిఠాపురం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు.



మొక్క నాటుతున్న ఉమర్ ఆలీషా

మరిడమ్మ తల్లి హుండీల ఆదాయం రూ.2.98 లక్షలు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి హుండీల ద్వారా 72 రోజులకు రూ.2,98,060 ఆదాయం సమకూరింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు ఈ విషయం తెలిపారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, దేవదాయ శాఖ పెద్దాపురం డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చల్లా ఉదయ్ బాబు నాయుడు సమక్షంలో అమ్మవారి ఆలయంలో హుండీలను సోమవారం తెరచి ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, ఆసాదులు, దేవస్థానం సిబ్బంది, మహిళా భక్త మండలి సభ్యులు పాల్గొన్నారు.



హుండీల ఆదాయం లెక్కిస్తున్న ఆసాదులు, భక్తులు

పర్యావరణహిత జీవన విధానమే మేలు

- ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి
- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ
- ఘనంగా పర్యావరణ దినోత్సవం



క్విజ్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న జేసీ ఇలక్కియ తదితరులు

కాకినాడ సిటీ: దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యావరణహిత జీవన విధానం అలవరచుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ), ధరిత్రి రక్షిత సమితి ఆధ్వర్యాన కాకినాడ సూర్య కళామందిరంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టండి' అనే నినాదంతో ఐక్యరాజ్య సమితి ఈ సంవత్సరం పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తోందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యత తీసుకోవాలని అన్నారు. అప్పుడే పర్యావరణ సమతుల్యత సాధ్యమన్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బ తిని, దుష్ప్రభావాలు ఎదురవుతున్నాయని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించారన్నారు. మనం నిత్యం వినియోగించే ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వందల సంవత్సరాలు పడుతుందన్నారు. ప్లాస్టిక బదులు జూట్, పేపర్ బ్యాగ్‌లు వాడాలని జేసీ ఇలక్కియ సూచించారు. పర్యావరణ హిత సమాజంపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో 'మిషన్ లైఫ్'లో భాగంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, శాస్త్రవేత్త వైఆర్ సత్యాజీరావు, జేఎన్‌టీయూకే న్యాయశాస్త్ర అధ్యాపకులు ఆలపాటి శ్రీనివాస్, ఎంహెచ్ఎం కృష్ణప్రసాద్ పలు సూచనలు చేశారు. అతిథులు ప్రసంగించిన అంశాలపై మధ్య మధ్యలో క్విజ్ నిర్వహించారు. సరైన సమాధానాలు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. తొలుత పర్యావరణ హిత జీవన విధానంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ఎస్.అశోక్‌కుమార్, ధరిత్రి రక్షిత సమితి అధ్యక్షురాలు ఎస్.సురేఖ, సభ్యులు జి.కృష్ణమోహన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పాడికి ఊతం.. రైతుకు రొక్కం

- సొంతంగా పశువుల మేత, దాణా తయారీతో మేలు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న 'పశు విజ్ఞాన బడి'
- పశు సంవర్ధక శాఖ ప్రత్యేక కృషి



పశు విజ్ఞాన బడిలో అజొల్లా తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న పశు వైద్యాధికారులు (ఫైల్)



ఇళ్ల వద్దనే సొంతంగా దాణా తయారు చేస్తున్న రైతులు

జిల్లాలో పాడి ఆవులు : 76,560
గేదెలు: 2,82,283
రోజువారీ పాల ఉత్పత్తి: 33,570

పిఠాపురం: పది మందికి అన్నం పెట్టే అన్నదాతకు దన్నుగా నిలిచేది పశు సంపద. అటువంటి పశువులు ఆరోగ్యంగా ఉండాలన్నా, పాల దిగుబడి ఎక్కువగా ఉండాలన్నా మంచి మేత, దాణా ఎంతో కీలకం. వ్యవసాయం వ్యాపారంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో పచ్చిమేత, దాణా కొరత ప్రధాన సమస్యగా మారింది. పెరుగుతున్న డెయిరీ ఫారాలకు అనుగుణంగా పశువులకు గ్రాసం లభ్యత పెరగాలని, లేకపోతే పాడి పరిశ్రమ దెబ్బ తింటుందని పశుసంవర్ధక శాఖను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో పుష్కలంగా పచ్చిమేత అందించడంతో పాటు.. అందుబాటులో ఉన్న దినుసులతో సొంతంగా దాణా తయారు చేసుకునేలా రైతులను ఆ శాఖ కార్యోన్ముఖులను చేస్తోంది. పోషక విలువలతో కూడిన అజొల్లా పచ్చిమేత, సొంతంగా దాణా తయారీపై అవగాహన కల్పిస్తోంది. తద్వారా గ్రామాల్లో పశుగ్రాస కొరతను తీర్చేందుకు కృషి చేస్తోంది.

పోషక విలువలతో దాణా

ఎక్కువ పోషక విలువలు కలిగిన దాణాను పశువులకు పెట్టడం ద్వారా మంచి పాల ఉత్పత్తి సాధించి, ఎక్కువ ఆదాయం పొందే వీలుంటుంది. ఇందుకోసం కార్బోహైడ్రేట్లు, మాంసకృత్తులు, ఖనిజ లవణాలు, విటమిన్లు ఉండేలా దాణా తయారు చేసుకోవాలి. జొన్న, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కొర్రల వంటివి 40 నుంచి 50 శాతం వరకూ దాణాలో చేర్చడం ద్వారా పశువుకు మంచి శక్తి కలిగి, పాల ఉత్పత్తి పెరుగుతుంది. అలాగే, నూనె తీసిన వేరుశనగ చెక్క, పొద్దుతిరుగుడు చెక్క, నువ్వుల చెక్క, పత్తి చెక్క, కొబ్బరి చెక్కలు 20 నుంచి 25 శాతం వినియోగించాలి. తద్వారా పశువుకు మాంసకృత్తులు అందుతాయి. వీటితో పాటు దాణాలో నూనె తీసిన వరి, గోధుమ తవుడు 10 నుంచి 15 శాతం ఉండేలా చూసుకోవాలి. అలాగే కంది, పెసర, మినప పొట్టు వంటివి 10 శాతం వేసుకోవచ్చు. 100 కిలోల దాణాకు 2 కిలోల ఖనిజ లవణాల మిశ్రమం, ఒక కిలో ఉప్పు కలుపుకోవాలి. ఈ సరకులు ఆయా సీజన్లలో వారి ప్రాంతాల్లో తక్కువ ధరకు దొరికినప్పుడు రైతులు కొనుగోలు చేసుకుని నిల్వ చేసుకుని, తక్కువ ఖర్చుతో దాణా తయారు చేసుకోవచ్చు. తమ పశువులు ఇచ్చే పాలను బట్టి ప్రతి లీటరు పాలకు అరకిలో దాణాను పశువుకు అందిస్తే మంచి ప్రయోజనం ఉంటుంది.

నిల్వ ఇలా చేయండి

దాణా తయారీకి ఉపయోగించే పదార్థాలతో పాటు తయారు చేసిన దాణాను ఎక్కడ పడితే అక్కడ నిల్వ చేస్తే తేమ తగిలి బూజు కట్టే అవకాశాలుంటాయి. ముఖ్యంగా తడి తగిలే ప్రదేశాల్లో ఉంచడం వల్ల త్వరగా బూజు కట్టి, పురుగులు పట్టి పాడవుతాయి. తయారు చేసిన దాణాను, దానికి ఉపయోగించే పదార్థాలను బాగా పొడి ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలి. నూనె తీయని పదార్థాలు తొందరగా చెడిపోయే అవకాశం ఉంటుంది కాబట్టి వాటిని ఎక్కువగా కాకుండా వారానికి అవసరమైనంత మాత్రమే నిల్వ ఉంచుకోవాలి. బూజు, పురుగు పట్టిన దాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ వాడకూడదు.

ఖర్చు తక్కువ.. రాబడి ఎక్కువ



అజొల్లా మేత తయారీకి పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహకాలు ఇస్తోంది. దీనిలో భాగంగా 'పశు విజ్ఞాన బడి' పేరుతో అజొల్లా, సొంతంగా దాణా తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. పశువుల శాల వద్దే వీటిని ఏర్పాటు చేసుకోవచ్చు. దీని ద్వారా చాలా వరకూ ఖర్చు తగ్గుతుంది. పాల ఉత్పత్తి పెరిగి నెలకు సుమారు రూ.10 వేల వరకూ అదనపు ఆదాయం వస్తుంది. అజోల్లా మేత వల్ల రోగ నిరోధక శక్తి పెరిగి, పశువులను వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చు. ఐదు లీటర్ల కంటే ఎక్కువ పాలు ఇచ్చే పశువుకు పచ్చి మేత 40 కిలోలు, ఎండు గడ్డి 15 కిలోలు, దాణా 10 కిలోలు అవసరం.
– డాక్టర్ హిమజ, పశు వైద్యాధికారి, గొల్లప్రోలు

సీఎం పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు


చురుగ్గా సాగుతున్న మలికిపురం- విశ్వేశ్వరాయపురం రోడ్డు పనులు

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ నెల 7వ తేదీన తన కుమారుడు రాపాక వెంకటరామ్ వివాహం మలికిపురం మండలంలోని కత్తిమండ గ్రామంలో తన నివాసం వద్ద జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి జగన్‌ను ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే రాపాక అన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో హెలీప్యాడ్ నిర్మాణంతో పాటు పలు రోడ్లను కూడా నిర్మిస్తున్నారు.

భారీగా చదివింపులు

- పేద విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన
- పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 21 కోర్సులకు అవకాశం

రాయవరం: పేద విద్యార్థుల సంక్షేమానికి పలు పథకాలను అందజేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం విదేశాల్లో చదువుకునే వారికి ఆర్థిక తోడ్పాటును అందించేందుకు జగనన్న విద్యా దీవెన పథకం అమలు చేస్తోంది. విదేశాలకు వెళ్లి చదువుకునే అర్హులైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజును పూర్తిగా ప్రభుత్వమే చెల్లించనుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అధికంగా రూ.1.25 కోట్లు, ఇతరులకు రూ.కోటి వరకు మంజూరు చేయనుంది. అర్హులైన విద్యార్థులకు పథకం అందించే క్రమంలో భాగంగా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకానికి జిల్లా నోడల్ అధికారిగా సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వ్యవహరిస్తున్నారు. పేద విద్యార్థులంతా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

టాప్ 50 యూనివర్సిటీల్లో చదివే అవకాశం

ప్రపంచవ్యాప్తంగా ఉన్న 379 యూనివర్సిటీ/ఇనిస్టిట్యూషన్లలో లేటెస్ట్ క్యూఎస్ రేటింగ్ ఆధారంగా టాప్ 50లో నిలిచిన యూనివర్సిటీ/ఇనిస్టిట్యూషన్లలో చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పీజీ లేదా పీహెచ్‌డీ, ఎంబీబీఎస్ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వం ఆర్థికంగా తోడ్పాటునందిస్తోంది. ఆయా కోర్సులకు సంబంధించిన అవసరమైన విద్యార్హతల్లో కచ్చితంగా 60 శాతం మార్కులు పొందిన వారినే పరిగణలోకి తీసుకుంటారు. ఎంబీబీఎస్ అభ్యసించేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు తప్పనిసరిగా దేశవ్యాప్తంగా నిర్వహించే నీట్ ఎంట్రన్స్‌లో అర్హత సాధించాలి. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు హెచ్‌టీటీపీ://జ్ఞానభూమి.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వారి అర్హతల ఆధారంగా ఎంపిక చేస్తారు.



సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం

ఈ కోర్సులకే అనుమతి

అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్, అగ్రికల్చర్ అండ్ ఫారెస్ట్రీ, ఆర్కిటెక్చర్ అండ్ బిల్ట్ ఎన్విరాన్‌మెంట్, ఆర్ట్ అండ్ డిజైన్, ఆర్ట్స్ అండ్ హ్యుమానిటీస్, బయోలాజికల్ సైన్స్, బిజినెస్, కెమిస్ట్రీ, కమ్యూనికేషన్ అండ్ మీడియా స్ట్రాటజీ, కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ అండ్ ఎకనామెట్రిక్స్, ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, ఇంజినీరింగ్, ఇంజినీరింగ్ మినరల్స్ అండ్ మైనింగ్, ఇంజినీరింగ్-పెట్రోలియం, హాస్పిటాలిటీ అండ్ లీజర్ మేనేజ్‌మెంట్, లా, మెడిసిన్, నేచురల్ సైన్స్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ.

జూన్ 10 వరకు గడువు



జగనన్న విదేశీ విద్యాదీవెనకు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 10 వరకు దరఖాస్తుకు గడువు ఉంది. కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.8లక్షలకు మించకుండా 35 ఏళ్ల వయసులోపు ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఉన్నత చదువులు చదువుకోవాలనే పేద విద్యార్థులకు ఈ పథకం ఒక వరం లాంటిది.

– డి.వి.రమణమూర్తి, జాయింట్ డైరెక్టర్, సాంఘిక సంక్షేమ శాఖ, కాకినాడ

కన్నతల్లిపై కొడుకు దాడి

తుని: కనిపెంచిన మాతృమూర్తిపై దాడి చేసిన ఘటనపై తుని పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ కె.సూరిబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తుని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉంటున్న టీడీపీ నాయకుడు శిల్పరెడ్డి జగన్మోహన్ తన తల్లి నూకరత్నంపై సోమవారం కర్రతో దాడి చేసి గాయపరిచాడు. ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్న నూకరత్నం డ్వాక్రా సంఘంలో సభ్యురాలు. గ్రూపు సభ్యుల్లో తనకు వచ్చిన రూ.50 వేలు నగదును కొడుకు జగన్మోహన్‌కు గతంలో ఇచ్చింది. తనకు సొమ్ము అవసరం ఉందని కొడుకును ఇంటికి వెళ్లి అడిగింది. దీంతో జగన్మోహన్ దురుసుగా గెంటి వేసి తర్వాత కర్రతో దాడి చేయడంతో నూకరత్నం గాయపడింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు తెలిపారు.

మూడున్నరేళ్ల బాలికపై కామాంధుడి దారుణం

ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

కాకినాడ రూరల్: కాకినాడ ముత్తానగర్‌లో కుటుంబంలోని మూడేళ్ల చిన్నారిపై సమీపంలోని నివాసం ఉంటున్న కామాంధుడు దారుణానికి ఒడిగట్టాడు. ఇంట్లో ఉన్న చిన్నారిపై 48 ఏళ్ల రామకృష్ణ అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో తల్లిదండ్రులు గమనించి ఆందోళన వ్యక్తం చేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. బాధిత చిన్నారి తల్లి వెంటనే పోలీసులను ఆశ్రయించడంతో ఇంద్రపాలెం ఏఎస్సై రాంబాబు నిందితుడిపై పోక్సో, అత్యాచార చట్టం కింద కేసు నమోదు చేశారు. పోక్సో కేసు దిశ స్టేషన్ పరిధిలోకి రావడంతో కేసును దిశ స్టేషన్‌కు బదలాయించారు. దిశ డీఎస్పీ కేసు విచారణ చేపట్టనున్నట్టు ఇంద్రపాలెం పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ ఏటిమొగకు చెందిన మత్స్యకార కుటుంబం ముత్తానగర్‌లో కాపురం ఉంటుండగా అదే మత్స్యకార కుటుంబానికి చెందిన రామకృష్ణ కుటుంబం కూడా పక్కనే నివాసం ఉంటోందన్నారు. చిన్నారిని అప్పుడప్పుడూ ఆడిస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో చిన్నారిని ఆడిస్తూ తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. ఆ సమయంలో రామకృష్ణ భార్య బయట పనిచేసుకుంటుందని, ఈ సమయంలోనే 48 ఏళ్ళ రామకృష్ణ అఘాయిత్యానికి పాల్పడ్డాడని చెప్పారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా కేసు నమోదు చేశామని, బాలికలను ప్రభుత్వాస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం పంపించామన్నారు.

దివ్యాంగులకు పరికరాల అందజేత


దివ్యాంగులకు చంక కర్రలు, చేతికర్రలు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని దివ్యాంగులకు ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో ఉచితంగా చంక కర్రలు, చేతి కర్రలు, సైలెంట్ వాకర్స్‌లను కలెక్టర్ కృతికా శుక్లా సోమవారం పంపిణీ చేశారు. దివ్యాంగులకు అవసరమైన పరికరాలను ఆశ్రయ వికలాంగుల సమాఖ్య సమకూర్చడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య అధ్యక్షుడు సురేష్ మాట్లాతూ ముగ్గురు ఐఐటీ చేసిన యువకులు ఫ్లేక్సీమో అనే కంపెనీని స్థాపించి వినూత్న పద్ధతిలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలు తయారు చేస్తున్నారన్నారు. వాయిస్ ఆఫ డిసేబిలిటీ సంస్థ సీఎస్ఆర్ సహకారంతో జిల్లాలో ఉన్న అందరికీ దివ్యాంగులకు అందజేయాలి అనేది ఆశయమన్నారు. మంగళవారం తూరంగి అయ్యప్పస్వామి ఆలయం సమీపంలో ఉన్న ఆశ్రయ జిల్లా వికలాంగుల సమాఖ్య సంస్థ కార్యాలయంలో మిగిలిన వారికి పరికరాలను ఉచితంగా అందిస్తామన్నారు. దివ్యాంగులకు అవసరమైతే తమ సంస్థను సంప్రదిస్తే కొలతలు తీసుకొని ఉచితంగా అందజేస్తామని సురేష్ వివరించారు. ఈ సంవత్సరంలో 100 మందికి ఈ పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు.

శిక్షణతో పరిపాలనపై అవగాహన

ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్


జెడ్పీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న శిక్షణతో వారికి పరిపాలనపై అవగాహన పెరుగుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం(ఈటీసీ) ప్రిన్సిపాల్, డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరిసీతారామరాజు, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులకు మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండవ బ్యాచ్‌కు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి జిల్లా వరకు మూడంచెల విధానంలో ఆయా సమావేశాల్లో పాల్గొనే హక్కు, అధికారం జెడ్పీటీసీ సభ్యులకు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుకు దూసుకుపోవడం ద్వారా మంచి ప్రజా ప్రతినిధులుగా గుర్తింపు పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు అవసరమైన సలహాలు, సూచనలు శిక్షణలో ఇస్తామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్ మాట్లాడుతూ జెడ్పీటీసీ సభ్యుల హక్కులు, బాధ్యతలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈటీసీ ఫ్యాకల్టీలు శ్రీదేవి, ఎంఎస్ఎన్‌రెడ్డి, నిహారిక, ప్రసాద్ పంచాయతీరాజ్ చట్టం, జిల్లా ప్రజాపరిషత్తుల ఏర్పాటు, సభ్యుల ఎంపిక, పదవీ కాలం, రాజీనామా, జిల్లా ప్రజాపరిషత్తు చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల విధులు, అధికారాలు, బాధ్యతలు, స్థాయీ సంఘాల ఏర్పాటు, సమావేశాల నిర్వహణ, చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం, జిల్లా పరిషత్తు బడ్జెట్ అంశాలపై మొదటి రోజు శిక్షణ నిర్వహించారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ హెచ్‌ఓడీగా నాగకుమార్



అనపర్తి: జాతీయ స్థాయిలో నిర్వహించే స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించే ఐదు క్రీడాంశాల నిర్వహణకు హెచ్ ఆఫ్ డెలికేషన్ హెచ్‌ఓడీగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి, స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ పీడీ ఆర్.నాగకుమార్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నల్లమిల్లి సత్తిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 66వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు ఈ నెల 6 నుంచి 12 వరకు ఢిల్లీలో జరగనున్నాయని చెప్పారు. 13 క్రీడాంశాల్లో జరిగే ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించే షూటింగ్, చదరంగం, యోగాసన, వెయిట్ లిఫ్టింగ్, టైక్వాండో ఐదు క్రీడాంశాలకు సంబంధించి హెచ్‌ఓడిగా నాగకుమార్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

అదిరిన 'సన్నాయి పాట'


వేలం నిర్వహిస్తున్న దేవస్థానం ఏసీ రమేష్ బాబు, ట్రస్టీ ధళే సూర్యనారాయణ, అధికారులు

- రత్నగిరిపై మార్మోగిన సన్నాయి మేళం లైసెన్స్ వేలం
- నెలకు రూ.18,00,116కు టెండర్ ఖరారు
- ఏడాదికి రూ. 2.16 కోట్ల ఆదాయం

అన్నవరం: స్థానిక శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో జరిగే వివాహాలు, ఉపనయనాలు, ఇతర శుభకార్యక్రమాలలో వాయించే సన్నాయి మేళం లైసెన్స్‌కు సోమవారం టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించగా రికార్డు స్థాయిలో వేలం ఖరారైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా నెలకు రూ.18,00,116కు టెండర్ ఖరారైంది. రెండేళ్ల కాలపరిమితికి గాను ఈ వేలం కం టెండర్ నిర్వహించారు. ఖరారైన టెండర్ ద్వారా మొదటి సంవత్సరం రూ.2.16 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉండగా, రెండో సంవత్సరం ఈ మొత్తంపై పది శాతం అదనంగా పాటదారుడు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రెండు సంవత్సరాలకు కలిపి రూ.4.54 కోట్ల ఆదాయం రానుంది. ఖరారైన టెండర్ మొత్తంపై 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

తొలుత వేలంపాట నిర్వహించగా నెలకు రూ.11 లక్షల వరకు పాట వెళ్లింది. అదే అత్యధిక మొత్తంగా అధికారులు భావించారు. ఆ తరువాత టెండర్ బాక్స్ ఓపెన్ చేయగా నెలకు రూ.18,00,116కు టెండర్ కోట్ చేయడంతో దానిని ఖరారు చేశారు.

దేవస్థానంలో అత్యధిక వేలం పాట ఇది

అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని అన్ని వ్యాపారాలలో అత్యధిక మొత్తంలో ఖరారైన వేలం పాట ఇది. ఇంత మొత్తంలో వేలం ఖరారవుతుందని దేవస్థానం వర్గాలు కూడా ఊహించలేదు. సాధారణంగా దేవస్థానంలో భక్తులు మొక్కు చెల్లించిన తలనీలాలు (జుత్తు) వేలం పాట రూ. కోట్లలో ఖరారవుతుంటుంది. రెండు, మూడేళ్లుగా తల నీలాల వేలం పాట కూడా రూ.రెండు కోట్లు దాటలేదు. ఎనిమిదేళ్ల క్రితం ఇదేవిధంగా వేలం నిర్వహించగా మొదటి సారి ఏడాదికి రూ. పది లక్షలు, రెండో సారి ఏడాదికి రూ.రూ.55 లక్షలకు వేలం పాట వెళ్లింది. ఇప్పుడు ఏకంగా ఏడాదికి రూ.2.16 కోట్లకు ఖరారైంది. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి తీసుకుని పాటదారునికి లైసెన్స్ మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు, ఏఈఓ జగ్గారావు, సూపరింటెండెంట్‌లు కంచి మూర్తి, కాపారపు శివ తదితరులు ఈ వేలం నిర్వహించారు. దేవస్థానం ట్రస్టీ ధళే వీర సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐటీఐ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

బాలాజీ చెరువు (కాకినాడ సిటీ): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నవారు తమ సర్టిఫికెట్లను మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలి. ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ జిల్లా కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ సోమవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఐటీఐ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు కాకినాడ లేదా జగ్గంపేటలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఏదో ఒకచోట తమ సర్టిఫికెట్లు వెరిఫై చేయించుకోవాలన్నారు. వెరిఫికేషన్ సమయంలో ఆన్‌లైన్ నమోదు పత్రం, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు చూపించాలని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోని వారు అడ్మిషన్‌కు అనర్హులని స్పష్టం చేశారు.